



మిడ్జిల్ మండలం మన్ననూర్‌లో పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి



నాగర్‌కర్నూల్ మండలం చౌటబెట్ల, తాళ్ల నరసింహాపురం గ్రామాల మధ్య కొట్టుకుపోయిన రోడ్డు

ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా కురిసిన వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. నారాయణపేట జిల్లాలో ఆరు వేల ఎకరాల్లో, వనపర్తిలో వెయ్యి, నాగర్‌కర్నూల్‌లో 930, మహబూబ్‌నగర్‌లో 622, జోగులాంబ గద్వాలలో 400 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులు సోమవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. పదుల సంఖ్యలో రోడ్లు దెబ్బతినగా, వందలాది ఇళ్లు నేలమట్టమయ్యాయి. తుఫాను ప్రభావంతో స్తంభించిన జన జీవనం సోమవారం కొంత తేరుకున్నది.

వర్షార్పణం

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల ఎకరాల్లో నీట మునిగిన వరి, పత్తి, జొన్న, కంది, పెసర పంటలు
- మహబూబ్‌నగర్ జిల్లాలో నాలుగు చెరువులకు గండ్లు, 26 చోట్ల తెగిన రోడ్లు
- నారాయణపేట జిల్లాలో 6 వేల ఎకరాల్లో పంట నష్టం
- నాగర్‌కర్నూల్ జిల్లాలో కూలిపోయిన 70 ఇళ్లు
- జోగులాంబ గద్వాల జిల్లాలో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు
- వనపర్తి జిల్లాలో వెయ్యి ఎకరాల్లో పంటల మునక



నాగర్‌కర్నూల్ నుంచి ఎండబెట్ల వెళ్లే దారిలో మినీ ట్యాంక్‌బండ్‌పై అలుగు పారుతుండటంతో నిలిచిన రాకపోకలు

నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్/నారాయణపేట/వనపర్తి అర్బన్/గద్వాల, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురిసిన వర్షానికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్ర నష్టం వాటిల్లింది. మహబూబ్‌నగర్ జిల్లాలో పంటలు దెబ్బతినడంతో పాటు ఇళ్లు కూలిపోయాయి. జిల్లా వ్యాప్తంగా నాలుగు ఇళ్లు పూర్తిగా, 64 ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు 149 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. అయితే వర్షం లేకపోవడంతో వారంతా తిరిగి ఇళ్లకు వెళ్లారు. 374 ఎకరాల్లో వరి, 117 ఎకరాల్లో పత్తి, 131 ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. నాలుగు చెరువులకు గండ్లు పడ్డాయి. 26 చోట్ల పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ రహదారులు కోతకు గురయ్యాయి. వాటిని అధికారులు పునరుద్ధరించే చర్యలు చేపట్టారు. రోడ్డు కోతకు గురైన ఇబ్రహీంబాద్ గ్రామానికి రాకపోకలు పునరుద్ధరించేందుకు రోజంతా ఎక్స్‌కవేటర్‌లతో పనులు చేయించారు. చిన్న చింతకుంట మండలం వడ్డేమాన్ సబ్‌స్టేషన్‌లోకి భారీగా వరదనీరు చేరడంతో ఆదివారం సబ్‌స్టేషన్‌ను బంద్ చేశారు. దాంతో మండలంలోని చిన్న వడ్డేమాన్, పెద్దవడ్డేమాన్, దమగ్నాపూర్, నెల్లికొండి, సీతారాంపేట గ్రామాలకు రాత్రి అప్పంపల్లి సబ్‌స్టేషన్ నుంచి కరెంట్‌ను పునరుద్ధరించారు. వరద తగ్గడంతో వడ్డేమాన్ సబ్‌స్టేషన్‌లో నీటిని తొలగించి, కరెంట్‌ను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.



నారాయణపేట జిల్లా కృష్ణ మండలం కున్సి గ్రామంలో నీట మునిగిన పత్తి పంట

నాగర్‌కర్నూల్ జిల్లాలో దెబ్బతిన్న వరి

నాగర్‌కర్నూల్ జిల్లాలో వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. వట్టెం రిజర్వాయర్ సమీపంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో కొండ చరియలు విరిగిపడ్డాయి. అక్కడ నివసిస్తున్న ప్రజలు త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 70 ఇళ్లు దెబ్బతిన్నాయి. కొల్లాపూర్ మండలం చౌటబెట్ల తండా, తాళ్లనరసింహాపురం గ్రామాల మధ్య రహదారులు వాన నీటికి కొట్టుకుపోయాయి. దాదాపు 240 ఎకరాలల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. పెంట్లవెల్లి మండలంలో వంద ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ అధికారి తెలిపారు. సింగోటం శ్రీవారి సముద్రంతో సహ అన్ని చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. ఉమామహేశ్వర క్షేత్రంలో కొండ చరియలు విరిగి పడుతున్న నేపథ్యంలో ఆలయాన్ని మూసివేశారు. తిమ్మాజిపేట మండలంలో వరి పంట దెబ్బతింది. నాగనూల్, కేసరి సముద్రం చెరువులు అలుగులు పారుతున్నాయి. దీంతో మంతటి, నాగనూల్, గగ్గలపల్లి, గుడిపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దేశిటిక్యాల గ్రామంలో 30 ఎకరాల్లో వరి పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. కేఎల్ఐ 29వ ప్యాకేజీ ప్రధాన కాల్వకు గండి పడింది. 128వ కిలో మీటరు వద్ద కల్వకుర్తి మండలం వెంకటాపూర్ శివారులో లింగారెడ్డి కుంట వెనుక యూటీ పక్కన కాల్వ కూడా దెబ్బతింది. బిజినేపల్లి మండలంలోని ఖానాపూర్, పాలెం, బిజినేపల్లి, వట్టెం, మహదేవునిపేట, శాయిన్‌పల్లి, పోలేపల్లి గ్రామాల చెరువులు అలుగు పారుతున్నాయి. పెద్దకొత్తపల్లి మండలంలో తొమ్మిది నోటిఫైడ్ చెరువులు, 136 చిన్ననీటి వనరులు ఉండగా.. అన్నీ అలుగులు పారుతున్నాయి. 500 ఎకరాల్లో వరి పంట, 60 ఎకరాల్లో పత్తి చేళ్ల దెబ్బతిన్నాయి.

నారాయణపేట జిల్లాల్లో చెరువులు, కాల్వలకు గండ్లు

మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు నారాయణపేట జిల్లాలో తీవ్ర పంటనష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా ఆరు వేల ఎకరాల్లో పెసర, పత్తి, కంది, ముంగార్ జొన్న పంటలు నీట మునిగాయి. నీటి ఉధృతి తగ్గితే తప్ప ఏ మేరకు పంట నష్టం జరిగిందో అంచనా వేయొచ్చని అధికారులు అంటున్నారు. చెరువులు అలుగు పారడం, వాగులు ఉధృతంగా ప్రవహించడంతో పంటలు దెబ్బతిన్నాయి. నారాయణపేట మండలం కోటకొండ పెద్ద చెరువు అలుగు పారడంతో పరిసర ప్రాంతాల్లో వరి పంట నీట మునిగింది. సింగారం వాగు, బండగొండ వాగు ఉప్పొంగడంతో అక్కడా వరి చేను దెబ్బతింది. అభంగపూర్ రామతీర్థం చెరువు కింద ఏడు ఎకరాల్లో వరి పంట కొట్టుకుపోయిందని రైతులు దస్తగిరి, దస్తప్ప, నంద్యానాయక్, ఆశప్ప వాపోయ్యరు. ధన్వాడ మండలం ఎన్మోన్‌పల్లిలో పత్తి పంట, శ్యాసన్‌పల్లి కాటన్ చెరువు ఉధృతికి వరి పంట నీట మునిగినట్లు ఆయా గ్రామాల రైతులు తెలిపారు. అమ్మిరెడ్డిపల్లి శివారులో యాతన్ కుంటకు గండి పడటంతో పంట పొలాల్లోకి నీరు చేరింది. లోతట్టు ప్రాంతాల్లో పత్తి, కంది, పెసర పంటలు ఊట కట్టి, వాడిపోతున్నాయి. మరికల్ మండలం పల్లెగడ్డ, మాదారం, కన్మనూర్, అప్పంపల్లిలలో వరి పంట నీట మునిగింది. మద్దూర్ మండలంలో జొన్న కంకులు నల్లబడ్డాయని రైతులు వాపోతున్నారు. కృష్ణ మండలం కూన్సి గ్రామంలో సంగంబండ కాలువకు గండి పండటంతో ఐదెకరాల్లో పత్తి పంట నీట మునిగిందని రైతు బాబు ఆవేదన వ్యక్తం చేశాడు. జిల్లా వ్యాప్తంగా రూ.రెండున్నర కోట్ల వరకు పంట నష్టం జరిగిండొచ్చని రైతాంగం చెబుతోంది.



మదనాపురం మండలం నర్సింగాపురంలో నీట మునిగిన వరి పంటను చూపుతున్న రైతు

నీట మునిగిన ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లల్లో నిర్మాణాలు

నాగర్‌కర్నూల్ కేసరి సముద్రంలో ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లల్లో నిర్మించిన వివాదాస్పద కట్టడాల్లోకి నీరు చేరింది. ఉయ్యాలవాడ నుంచి సెయింట్‌ఆన్ స్కూల్ ఎండబెట్ల శివారు వరకు నిర్మాణాలను వాన నీరు చుట్టు ముట్టింది. ఇళ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడింది. తమవద్ద డబ్బులు తీసుకుని ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లల్లో ప్లాట్లు అమ్మిన వారిని మహిళలు శాపనార్థాలు పెడుతున్నారు. ఉయ్యాలవాడ గ్రామంలోని ఊటకుంటను కబ్జా చేసుకునేందుకు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు మట్టిని నింపారని, ఉద్దేశపూర్వకంగా కుంటకు గండి పెట్టడంతో గ్రామంలో 50 ఎకరాల్లో వరి చేనుకు నష్టం వాటిల్లిందని ఉయ్యాలవాడ రైతు భీముడు ఆరోపించాడు. 75 ఎకరాలకు నీరందించే ఊడ కుంట పరివాహక ప్రాంతాన్ని దారి మళ్లించడంతో తమ ఇళ్లలోకి నీళ్లు వస్తున్నాయని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం షాబాద్‌లో కూలిన ఇంటి గోడ

వనపర్తి జిల్లాలో వెయ్యి ఎకరాల్లో పంటల మునక

వర్షానికి వనపర్తి జిల్లా వ్యాప్తంగా వెయ్యి ఎకరాల్లో పంట నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం చేసిన సర్వేలో గుర్తించారు. చెరువులు, వాగుల కింద ఈ నష్టం వాటిల్లింది. ఇంకా రెండు రోజులు భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయని, జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

జోగులాంబ గద్వాలలో 400 ఎకరాల్లో..



బీరోలులో నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న అధికారి

జోగులాంబ గద్వాల జిల్లాలో 400 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. పత్తి 205 ఎకరాల్లో, కందులు 30, మిరప 95, వరి 70 ఎకరాల్లో నీట మునిగాయి. గద్వాల మండలంలోని రేకులపల్లిలో 50 ఎకరాల్లో, బీరెల్లిలో 30 ఎకరాల్లో వరి పంట దెబ్బతినగా, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్ పరిశీలించారు. రైతులు పంట పొలాల్లోని నీటిని బయటికి వెళ్లేలా చేస్తే పంట నష్టం తగ్గించవచ్చని సూచించారు. జిల్లా వ్యాప్తంగా 85 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయిజ, ఉండవెల్లిలోని కొన్ని కాలనీల్లోకి నీళ్లు చేరాయి. గద్వాల పట్టణంలోని రామయ్యతోట కాలనీలోకి నీళ్లు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రజలకు అండగా ఉంటాం

- ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్: భారీ వర్షాల కారణంగా మహబూబ్‌నగర్‌లోని లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి అండగా ఉంటామని ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని మోతీనగర్ రైల్వే అండర్ బ్రిడ్జీ కింద వరద నీరు చేరడంతో మోతీనగర్ ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే సోమవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. సమస్య పరిష్కారంపై అధికారులతో మాట్లాడారు. శాశ్వత పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ అరుణ మాట్లాడుతూ పాలమూరు పట్టణంలోని మోతీనగర్‌లో పాత ఆర్‌యూబీ ఉన్నదన్నారు. ప్రస్తుతం కొత్తగా చేపట్టే ఆర్‌యూబీలను అప్‌గ్రేడ్ చేశారని, అక్కడ డ్రైనేజీ వ్యవస్థను కూడా ఏర్పాటు చేసి, దగ్గరలోని కాలువలకు కలుపుతున్నారని తెలిపారు. అలాంటి అప్‌గ్రేడ్ విధానం ఇక్కడ చేయడానికి ఉన్న అవకాశాలపై రైల్వే అధికారులతో మాట్లాడతానన్నారు. రైల్వే ఫుట్ ఓవర్ కోసం అడిగారని, దాన్ని చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వరద కారణంగా చాలా ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి, కాలనీల్లోకి నీరు చేరిందన్నారు. ఇబ్బందులు కలుగకుండా నిన్నటి నుంచి అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. మోతీనగర్ ఆర్‌యూబీ సమస్యపై కాలనీ వాసులు చెప్పారని, కేంద్ర ప్రభుత్వం ద్వారా సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరామన్నారు. పక్కనే ఉన్న రైల్వే పరిధిలోని భూమి నుంచి మోతీనగర్‌కు రహదారి కావాల్సి ఉందని, ఇందుకు రైల్వే శాఖ అనుమతి కావాలన్నారు. వారు అనుమతిస్తే మునిసిపాలిటీ ఆధ్వర్యంలో రోడ్డు వేయిస్తామని తెలిపారు. కాలనీ మీదనుంచి రైల్వే ట్రాక్ వెళ్తున్నందున ట్రాక్ దాటేందుకు స్థానికులు ఫుట్ ఓవర్ బ్రిడ్జి అడుగుతున్నారని, దాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. పాలమూరు అభివృద్ధి విషయంలో అందరం కలిసికట్టుగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులు, అచ్చుగట్ల అంజయ్య పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లోని మోతీనగర్‌లో రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



రామన్‌పాడు రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీరు



జూరాల ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు


ప్రాజెక్టులకు జలకళ..
సందర్శకుల కిటకిట

ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు, రిజర్వాయర్‌లు జలకళను సంతరించుకోవడంతో వాటిని చూసేందుకు సందర్శకులు సోమవారం తరలొచ్చారు. జోగుళాంబ గద్వాల జిల్లా జూరాల జలాశయం నుంచి 45 గేట్లను ఎత్తి, నీటిని విడుదల చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టు కోయిల్‌సాగర్ నాలుగు గేట్లను ఎత్తారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం సైఫన్ సిస్టమ్ గల సరళా సాగర్ ప్రాజెక్టు రెండు సైఫన్‌లు రెండో రోజూ తెరుచుకున్నాయి. జిల్లాలోని రామన్‌పాడు రిజర్వాయర్ నాలుగు గేట్లను, నారాయణపేట జిల్లా సంగంబండ రిజర్వాయర్ ఐదు గేట్లను ఎత్తారు. డిండి రిజర్వాయర్ అలుగు పారింది..

- ధరూరు/ దేవరకద్ర/ మదనాపురం/ అచ్చంపేట/మక్తల్ రూరల్



జూరాల ప్రాజెక్టు వద్ద సందర్శకులు



సరళాసాగర్ సైఫన్ సిస్టమ్ ద్వారా వస్తున్న నీరు



సరళాసాగర్ వద్ద సెల్ఫీ దిగుతున్న సందర్శకులు



కోయిల్‌సాగర్ గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు



మునిసిపల్ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్న మునిసిపల్ ఇన్‌చార్జి చైర్‌పర్సన్, కమిషనర్

చికెన్ మటన్ వ్యర్థాల
తరలింపునకు వేలం

- రూ.70.50 లక్షలకు దక్కించుకున్న ఎర్రవల్లి వాసి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జడ్చర్ల, సెప్టెంబరు 2: జడ్చర్ల మునిసిపాలిటీలో చికెన్, మటన్, చేపల వ్యర్థాల తరలింపు కోసం సోమవారం వేలం నిర్వహించారు. రూ.70 లక్షలా 50 వేలకు ఎర్రవల్లి వాసి దక్కించుకున్నారు. మునిసిపాలిటీ కార్యాలయంలో ఇన్‌చార్జి చైర్‌పర్సన్ పాలాదిసారిక, కమిషనర్ రాజయ్య సమక్షంలో వేలం నిర్వహించారు. వేలంలో పది మంది పాల్గొన్నారు. ఒక సంవత్సరం గడువుకు టెండర్ నిర్వహించగా జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లికి చెందిన నర్సిములు వేలాన్ని దక్కించుకున్నాడు. ఎవరూ ఊహించని విధంగా రూ.70 లక్షలా 50 వేల ధర పలుకడంతో పాలకవర్గం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

ఆంధ్రజ్యోతి కథనంతోనే..

వ్యర్థాల తరలింపునకు సంబంధించి కేవలం రూ.75 వేలతో టెండర్ ప్రక్రియను గతంలో రెన్యూవల్ చేసుకున్న విషయంతో పాటు, వ్యర్థాల తరలింపులో పోటీ ఉందంటూ గత నెల మూడున 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఆ కథనం పాలకవర్గంలో చర్చనీయాంశం కాగా, వ్యర్థాల తరలింపు కోసం టెండర్ నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. టెండర్ రూ.70 లక్షలు పలుకడంతో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. జిల్లా కేంద్రం మహబూబ్‌నగర్ మునిసిపాలిటీలో వ్యర్థాల తరలింపు కేవలం రూ.15 లక్షలకే టెండరు దక్కిందని పాలకవర్గం సభ్యులు చర్చించుకున్నారు. చికెన్, మటన్, చేపల వ్యర్థాల తరలింపులో కాంట్రాక్టర్‌ల మధ్య పోటా పోటీ ఉందని 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంతోనే మునిసిపాలిటీకి ఊహించని విధంగా ఆదాయం లభించనున్నదని పాలకవర్గం సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.



యువకుడి అదృశ్యం - కేసు నమోదు

జడ్చర్ల, సెప్టెంబరు 2 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన దయ్యాల కుమార్ అనే యువకుడు అదృశ్యం కావడంతో తండ్రి వెంకటయ్య ఫిర్యాదు చేశారని సీఐ ఆదిరెడ్డి తెలిపారు. గత నెల 28న జడ్చర్లకు వెళ్తున్నట్లు చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో పరిసరాలలో ఆ చూకీ కోసం వెదికినా ఫలితం లేకపోవడంతో సోమవారం ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.



డెంగీ కేసు నమోదు

- చుట్టు పక్కల వారి రక్త నమూనాల సేకరణ

పాన్‌గల్, సెప్టెంబరు 2: వనపర్తి జిల్లా పాన్‌గల్ మండల పరిధిలోని రేమద్దుల గ్రామంలో డెంగీ కేసు నమోదు అయినట్లు మండల ప్రాథమిక వైద్యాధికారి చంద్రశేఖర్ తెలిపారు. గ్రామానికి చెందిన మండ్ల వెంకటమ్మ జిల్లా ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయించుకోగా డెంగీ పాజిటివ్ నమోదైనట్లు ఆయన తెలిపారు. దీంతో సోమవారం వైద్యసిబ్బంది గ్రామానికి చేరుకొని కుటుంబ సభ్యులకు చుట్టు పక్కల వారికి రక్త నమూనాలు సేకరించి పరీక్షలకు పంపారు. అనంతరం దోమల వ్యాప్తితో సంభవించే సీజనల్ వ్యాధులు కలరా, డెంగీ, మలేరియా, చికున్ గున్యా వంటి రోగాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యసిబ్బంది సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పీ వైద్యాధికారులు తారా, శశాంక్, లారెన్స్, హెల్త్ అసిస్టెంట్లు రాంచందర్, మదన్ గోపాల్, సతీష్, ఏఎన్ఎం శాంతమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

అక్రమ రిజిస్ట్రేషన్‌పై పోలీసులకు ఫిర్యాదు


ఏఎస్సైకి సుబ్బారెడ్డి వినతిపత్రాన్ని చేస్తున్న జయరాజ్

అలంపూర్ చౌరస్తా, సెప్టెంబరు 2 : అలంపూర్ చౌరస్తాలోని సీలింగు భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిపై మానవపాడు మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన జయరాజ్ అనే వ్యక్తి సోమవారం ఉండవల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చౌరస్తాలోని సర్వే నెంబరు 273ఆ/1లో 13.5 సెంట్ల సీలింగ్ భూమిని తప్పుడు ఆధారాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన రెడ్డిగారి మహేశ్వర్‌రెడ్డి, షఫీయుల్లా, సబ్ రిజిస్ట్రార్ మూబషీర్, డాక్యుమెంట్ రైటర్ మెహిన్‌ఉల్లాలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై ఉండవల్లి ఏఎస్ఐ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రిజిస్ట్రేషన్‌పై ఫిర్యాదు అందిందని, విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపి, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముగ్గురు కేజీబీవీ కాంట్రాక్టు ఉద్యోగుల బదిలీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం సెప్టెంబరు 2 : కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు సీఆర్‌టీ , పీజీసీఆర్‌టీ , అకౌంటెంట్, పీఈటీ ఉద్యోగుల బదిలీలు కొనసాగుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా వారి బదిలీలకు సంబంధించి మొత్తం పదకొండు మంది దరఖాస్తు చేసుకోగా, ముగ్గురు బదిలీ అయినట్లు సెక్టోరియల్ అధికారి బైకాని బాలుయాదవ్ తెలిపారు. ఇందుకు సంబంధించి సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి జిల్లా బదిలీలు మరో రెండురోజుల్లో పూర్తి కానున్నట్లు తెలిపారు.

నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం



గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేస్తున్న పోలీసులు

మరికల్, సెప్టెంబరు 2: నిషేధిత గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు మరికల్ ఎస్ఐ మురళి సోమవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా మరికల్ మండలం చిత్తనూర్ గ్రామానికి చెందిన ఎల్లూర్ నూతన్ అనే వ్యక్తి మహబూబ్‌నగర్ నుంచి సొంత గ్రామానికి తన కారులో నిషేధిత గుట్కా, జర్దా ప్యాకెట్లను తీసుకెళ్తున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పెద్ద చింతకుంట శివారులో కారును ఆపి తనిఖీ చేశారు. కారులో గుట్కాప్యాకెట్లు లభించడంతో వాటిని స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గుట్కా ప్యాకెట్ల విలువ రూ. 98,505లు గుర్తించారు. అనంతరం ఎల్లూరి నూతన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన వాటిని విక్రయించిన, తరలించిన కేసులు తప్పవని ఆయన హెచ్చరించారు.











అద్దె చెల్లించరు.. ఖాళీ చేయరు

- ఏళ్ల తరబడి పాతుకుపోయారు..
- పురపాలికలో 194 అద్దె దుకాణాలను ఖాళీ చేయాలని నోటీసులు
- నెలకు రావాల్సింది రూ.42.52 లక్షలు.. వస్తున్నది రూ.6 లక్షల లోపే..
- పదేళ్లుగా రూ.17.83 కోట్ల మొండి బకాయిలు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 2 : వారిది ఫెవికాల్ బంధం.. ఏళ్ల తరబడి పాతుకుపోవడంతో వారిదే ఇష్టారాజ్యంగా మారుతోంది. అధికారులు ఎవరొచ్చినా, పాలకులు ఎవరైనా డోంట్ కేర్ అంటున్నారు. వ్యాపారాలు చేసుకుంటున్నా నెలవారి అద్దె మాత్రం చెల్లించరు.. ఖాళీ చేయమంటే చేయరు.. దీంతో యంత్రాంగం వారి విషయంలో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. చేసేది లేక అధికారులు పోలీసులను ఆశ్రయించి వారి ఆధ్వర్యంలో ఖాళీ చేయించాలనే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. పాలమూరు పురపాలిక పరిధిలో 258 అద్దె దుకాణాలున్నాయి. వీటిలో 20 దుకాణాలు ఖాళీగా ఉండటం, ఇతరత్రా మరమ్మతుల పేరుతో తాళం వేయబడ్డాయి. మిగతా 238 దుకాణాలుండగా వీటి నుంచి నెలనెల అద్దె నామమాత్రంగా వసూలవుతోంది. ప్రతీనెల రూ.42,52,496 అద్దె రావల్సి ఉండగా ఇక్కడ రూ.5, 6 లక్షలకు మించి అద్దె రావడం లేదు. మునిసిపాలిటీ వచ్చే ఆదాయ వనరుల్లో కీలకమైన అద్దెలు రాకపోవడంతో పుర ఆదాయానికి గండి పడుతోంది. కొన్ని దుకాణాలు పదేళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో వాటిపై రూ.50-60 లక్షల వరకు అద్దె పెండింగ్‌లో ఉంది. మొత్తంగా మునిసిపాలిటీ పరిధిలో అద్దె దుకాణాల బకాయి రూ.17.83 కోట్లు ఉంది. వీటిని ఎలా వసూలు చేయాలో అధికారులకు అర్థం కావడం లేదు. అందుకే నెలనెల అద్దె బకాయి పేరుకుపోతూనే ఉంది. గట్టిగా చర్యలు తీసుకుందామంటే చివరి క్షణంలో రాజకీయ నాయకులను ఆశ్రయించి వారిచేత నిలిపివేయించుకుంటున్నారు. ఇప్పుడు కూడా ఏం చేస్తారో చూడాలి. పురపాలికకు ఆదాయం సమకూర్చడంలో ఆస్తి పన్ను తరువాత అద్దె దుకాణాల రూపంలోనే ఆదాయం వస్తుంది. వ్యాపారు లు మాత్రం సక్రమంగా అద్దెలు చెల్లించకుండా పుర ఆదాయానికి గండి కొడుతున్నారు.

వ్యాపారులు సహకరించాలి..



పురపాలికకు ఆదాయం వస్తేనే ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించగలుగుతాం. పాలమూరు పురపాలిక పరిధిలో 194 దుకాణాల నుంచి అద్దె బకాయి ఉండటంతో ఇప్పటికే ఫైనల్ నోటీసులు జారీ చేశాం. ఖాళీ చేయకపోయినా, బకాయి చెల్లించకపోయినా పోలీస్ ప్రొటెక్షన్‌తో ఖాళీ చేయించేందుకు చర్యలు తీసుకుంటాం.

- ఖాజా, రెవెన్యూ ఆఫీసర్


మహబూబ్‌నగర్ పురపాలిక పరిధిలోని గడియారం చౌరస్తాలో అద్దె దుకాణాలు

నోటీసులు జారీ

ఇప్పటికే అద్దె చెల్లించాలని అధికారులు పలుమార్లు దుకాణాల చుట్టూ తిరిగినా వారినుంచి స్పందన లేకపోవడంతో నోటీసులు ఇవ్వాలని నిర్ణయించారు. 238 దుకాణాలకు గాను 208 దుకాణాలకు ఫస్ట్ నోటీస్.. ఇందులో 194 దుకాణాలకు ఫైనల్ నోటీసులు జారీ చేశారు. దుకాణాలు ఖాళీ చేయడం, లేకపోతే అద్దె బకాయి చెల్లించాలని అధికారులు చెబుతున్నారు. అద్దె చెల్లించక, దుకాణాలను ఖాళీ చేయకపోతే పోలీస్ ప్రొటెక్షన్‌తో ఖాళీ చేయించాలని అధికారులు భావిస్తున్నారు. నోటీసులు అందుకున్న వాటిలో మార్కెట్ ప్రాంతంలో 54, టీడీగుట్టలో ఎనిమిది, గడియారం చౌరస్తాలో 41, న్యూటౌన్‌లో 67, న్యూబస్టాండ్‌లో 72, బస్టాండ్ వద్ద 18, పద్మావతి కాలనీలో ఎనిమిది, ఏనుగొండలో మూడు దుకాణాలు ఉన్నాయి.

ఉమామహేశ్వరంలో నేటి నుంచి నిత్య పూజలు


కొండపైన ఏర్పాటు చేసిన బారికేడ్లు

అచ్చంపేటఅర్బన్, సెప్టెంబరు 2: శ్రీశైలం ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో మంగళవారం ఉదయం 7 గంటల నుంచి యథావిధిగా నిత్యపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు కొండ చెరియలు విరిగి పడ్డాయి. దీంతో పూజా కార్యక్రమాలు నిలిపివేశారు. రంగాపూర్ నుంచి ఉమామహేశ్వరానికి వచ్చే మార్గాన్ని అటవీశాఖ అధికారులు బారికెడ్లుతో మూసివేశారు. సోమవారం అచ్చంపేట ఎస్సై రాము ఆలయాన్ని సందర్శించారు. ఎలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నేటి నుంచి అర్చకులు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయం వద్దకు భక్తులు ఎవరూ వెళ్లకుండా కొండదిగువన ఉన్న బోగ మహేశ్వరం వద్ద బారికెడ్లు ఏర్పాటు చేశారు.

అడవి జంతువుల గుర్తింపు కోసం సీసీ కెమెరాల ఏర్పాటు

ఊర్కొండ, సెప్టెంబరు 2: అడవి జంతువుల దాడులు వరుసగా జరుగుతుండటంతో భయాందోళనలకు గురవుతున్నా రైతాంగానికి అటవీ శాఖ అధికారులు సోమవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మనోధైర్యం కల్పించారు. మండలంలోని బొమ్మరాజుపల్లి శివారులో లేగ దూడలు, మేకలు గుర్తు తెలియని అడవి జంతువుల దాడి చేస్తున్నాయి. రైతుల ఫిర్యాదు మేరకు అటవీ శాఖ అధికారులు సోమవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాలి ముద్రలను బట్టి హైనాలుగా గుర్తించామని, అవి గుంపులుగా వచ్చి పశువులపై దాడి చేస్తుంటాయని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అటవీశాఖ ఉన్నతాధికారులతో సోమవారం పలు విషయాలపై చర్చించామని, బోనులు ఏర్పాటు చేయడం కోసం అనుమతి వచ్చే అవకాశం ఉందని ఫారెస్టు బీట్ ఆఫీసర్ వెంకటరమణమ్మ తెలిపారు. అటవీశాఖ అధికారులు చంద్రుడు, రైతులు ఉన్నారు.


బొమ్మరాజుపల్లిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

అడవిలో తప్పిపోయిన నీల్‌గాయ్

- కాపాడిన అటవీ శాఖ సిబ్బంది
- మన్ననూరు సీబీఈటీలో చికిత్స


నీల్‌గాయ్‌కి పాలు పట్టిస్తున్న అటవీశాఖ అధికారులు

మన్ననూర్, సెప్టెంబరు 2: అడవిలో తప్పిపోయి గాయపడి ఉన్న మూడు రోజుల క్రితం జన్మించిన నీల్‌గాయ్ పిల్లని అటవీ సిబ్బంది కాపాడిన ఘటన నల్లమల అభయారణ్య ప్రాంతంలో సోమవారం చోటు చేసుకుంది. అమ్రాబాద్ పులుల అభయారణ్య ప్రాంతంలోని మద్దిమడుగు రేంజ్‌లో విధులు నిర్వహిస్తున్న టైగర్ ప్రొటెక్షన్ వాచర్లకు తల్లి నుంచి తప్పిపోయి నటువంటి నీల్‌గాయి కనిపించింది. తక్షణమే అటవీ ఉన్నతాధికారులకు సమాచారం అందించి మన్ననూరు సీబీఈటీకి తీసుకువచ్చారు. స్వల్పంగా గాయపడిన నీల్‌గాయ్‌కి చికిత్స నిర్వహించి, ఫీడింగ్ బాటిల్ ద్వారా పాలు పట్టించారు. అనంతరం అటవీ శాఖ అంబులెన్సులోనే మద్దిమడుగు రేంజ్‌లోని అడవిలోకి తీసుకెళ్లారు. తల్లి చెంతకు పసికూనను చేర్చేందుకు అటవీ అధికారులు ప్రయత్నిస్తున్నారు. కార్యక్రమంలో బయాలజిస్టు మహేందర్, అటవీ విద్యాధికారిణి శ్వేత, బయో ల్యాబ్ అసిస్టెంట్ గణేష్ పాల్గొన్నారు.

కేఎల్ఐ యూటీ వద్ద గండి


కేఎల్ఐ యూటీ వద్ద గండి పడి పారుతున్న నీరు

కల్వకుర్తి, సెప్టెంబరు 2 : వెంకటాపూర్ సమీపంలో కేఎల్ఐ కాల్వ యూటీ పక్కన గండి పడింది. వర్షపు నీరు యూటీ పక్కన మట్టిపై వెళ్లడంతో గండి పడి సమీపంలోని వరి చేను కోతకు గురైంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జలదిగ్బంధంలో ఉల్పర పాఠశాల

వంగూరు, సెప్టెంబరు 2: మండలంలోని ఉల్పర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల జలదిగ్బంధంలో ఉంది. వర్షాలకు ఆవరణలో మొత్తం నీటితో నిండి కుంటను తలపిస్తుంది. దీంతో విద్యార్థులు పాఠశాలకు రావాలంటే జంకుతున్నారు. లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నీరు తగ్గితేనే విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చే అవకాశం ఉంది. అధికారులు స్పందించి ఆవరణలోని నీటిని బయటకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అనుమతి లేని క్లినిక్‌కు నోటీసు

గద్వాల క్రైం, సెప్టెంబరు 2: అనుమతి లేకుండా నిర్వహిస్తున్న క్లినిక్‌కు వైద్యసిబ్బంది సోమవారం నోటీసులు జారీ చేశారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ సమీపంలో ఈఎన్‌టీ క్లినిక్‌ను వైద్యసిబ్బంది ఆకస్మికంగా తనిఖీ చేశారు. దీనికి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో యాజమాన్యానికి, డాక్టర్‌కు నోటీసులు అందజేశారు. ఈ తనిఖీలో డిప్యూటీ డీఈఎంఓ మధుసూదన్‌రెడ్డి, ఎపిడమాలజిస్టు సుమీత్‌చంద్రారెడ్డి, హెల్త్ అసిస్టెంట్ నర్సయ్య ఉన్నారు.

ప్రమాదవశాత్తు గొర్రెల కాపరి మృతి

అచ్చంపేట టౌన్, సెప్టెంబరు 2: ప్రమాదవశాత్తు గొర్రెల కాపరి మృతి చెందిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం ఘనపూర్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా చందన్‌పేట మండలం తెల్లదేవురిపల్లి చెందిన మన్నె నిరంజన్ (47) గొర్రెలను మేపేందుకు ఘనపూర్ సమీపంలోని కొండకు వచ్చాడు. కొండపై ఉన్న దరిపై కూర్చొని ఉండగా ఒకసారిగా కూలింది. దాంతో ఆయన కిందపడి అక్కడిక్కడే మృతి చెందాడు. అటుగా వచ్చిన కాపరులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

మహిళపై దాడి

- జరిమానా విధింపు

వంగూరు, సెప్టెంబరు 2: నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని పోల్కంపల్లిలో కేశమోని నాగమ్మపై 2017 ఏప్రిల్‌లో యుగేందర్ దాడి చేశాడు. దీనిపై బాధిత మహిళ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ మహేందర్ తెలిపారు. ఈ కేసులో నిందితుడు యుగేందర్ కు సోమవారం కల్వకుర్తి న్యాయమూర్తి కావ్య రూ.2వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

నిర్వాసితుల ఇళ్లపై విరిగిపడ్డ కొండచరియలు

- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం
- భయంతో రాత్రివేళ జాగారం చేస్తున్న ఆర్‌అండ్‌ఆర్ కాలనీవాసులు
- కొండచరియలు ఇళ్లపై పడకుండా రక్షణ కల్పించాలని నిర్వాసితుల వేడుకోలు

బిజినేపల్లి, సెప్టెంబరు 2 : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు అడ్డదిడ్డంగా తవ్వేసిన గుట్ట కొండచరియలు విరిగి నిర్వాసితుల ఇళ్లపై పడ్డాయి. ఒక్కసారిగా మట్టి దిబ్బలు దూసుకురాగా నిర్వాసితులు భయాందోళనకు గురయ్యారు. త్రుటిలో ప్రాణాపాయం తప్పిందని తెలిపారు. సోమవారం ఆర్‌అండ్‌ఆర్ కాలనీవాసులు తెలిపిన వివరాల మేరకు.. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా వట్టెం రిజర్వాయర్ నిర్మాణంలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు పునరావాసం కోసం పక్కనే ఉన్న గుట్టను తవ్వి అనేకాన్‌పల్లి, అనేకాన్‌పల్లి తండా, కారుకొండ తండా, జీగుట్ట తండాకు చెందిన 466 మంది


త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్న కుటుంబ సభ్యులు


విరిగిపడిన కొండ చరియల మట్టి దిబ్బలు

నిర్వాసితులకు 250 చదరపు గజాల చొప్పున ప్లాట్లు కేటాయించారు. భారీ వర్షాలు వస్తే కొండ చరియలు విరిగిపడతాయని జీగుట్ట తండా, కారుకొండ తండాల నిర్వాసితులు అప్పట్లోనే కేటాయించిన ప్లాట్లను వదిలేసి పరిహారం నగదుతో బిజినేపల్లి సమీపంలో ప్లాట్లు కొనుగోలు చేసుకొని ఇళ్లు నిర్మించుకున్నారు. అనేకాన్‌పల్లి తండా, అనేకాన్‌పల్లి గ్రామానికి చెందిన నిర్వాసితులు మాత్రం ప్రభుత్వం కేటాయించిన స్థలాల్లోనే ఇళ్లను నిర్మించుకొని నివాసం ఉంటున్నారు. నాలుగు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు సోమవారం తెల్లవారుజామున కొండ చరియలు విరిగి పక్కనే ఉన్న గవిళ్ల వెంకటయ్య ఇంటిపై పడ్డాయి. పెద్ద శబ్ధం రావడం, ఇంట్లోకి మట్టి దిబ్బలు పడడంతో భయంతో బయటకు పరుగులు తీసినట్లు బాధితకుటుంబ సభ్యులు వాపోయారు. పక్కనే ఉన్న మరో ఇంటిపై మట్టి దిబ్బలు పడి బురదమయంగా మారింది. గుట్టకు మరోవైపు ఉన్న మాజీ సర్పంచ్ ఇంటి పక్కన కొండచరియలు విరిగి రోడ్డుపై పడ్డాయి. మట్టిని తవ్వి పాలమూరు, రంగారెడ్డి రిజర్వాయర్ పనులు చేస్తున్న గుత్తేదారులు గుట్ట చుట్టూ రక్షణగా ప్రహరీ నిర్మించి ప్రాణాలకు రక్షణ కల్పించాలని నిర్వాసితులు కోరతున్నారు. లేదంటే అరకొరగా తవ్వేసిన గుట్టను పూర్తిగా తొలగించి ఇబ్బందులు లేకుండా చూడాలని వేడుకుంటున్నారు.

తెగిన రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

- రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ పరిశీలన
- ఇబ్రహీంబాద్, పుల్వవానిపల్లి గ్రామాలకు రాకపోకలు ప్రారంభం

హన్వాడ/మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), సెప్టెంబరు 2: చించోలి- మహబూబ్‌నగర్ 167 జాతీయ రహదారి తెగి రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్, కలెక్టర్ విజయేందిర బోయి తెగిన రహదారిని పరిశీలించారు. రోడ్డు తెగి పోవడానికి కారణాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ఇబ్రహీంబాద్ సమీపంలోని ములకుంట వాగు, హేమసముద్రం అలుగు వాగుల వద్ద రోడ్డు బ్రిడ్జి పనులు జరుగుతున్నాయని, వరద తాకిడికి రోడ్డు తెగిపోవడంతో మహబూబ్‌నగర్ నుంచి తాండూర్ వరకు వెళ్లె వాహనాల రాకపోకలు నిలిచిపోయినట్లు అధికారులు తెలిపారు. పనులు వెంటనే చేపట్టి రోడ్డును పునరుద్ధరించాలని జాతీయ రహదారి అధికారులను ఆదేశించారు. ఆయన వెంట అదనపు కలెక్టర్, మండల అధికారులు, జాతీయ రహదారి అధికారులు పాల్గొన్నారు. కాగా, నిర్బంధంలో ఉన్న ఇబ్రహీంబాద్, పుల్వవానిపల్లి గ్రామాల ప్రజల రాకపోకలకు తాత్కాలికంగా రోడ్డును పునరుద్ధరించారు. సోమవారం సాయంత్రం బెరోనికుంట వద్ద తెగిన రోడ్డు కల్వర్టులకు మరమ్మతులు చేసి కొత్తగా వేసిన బ్రిడ్జిపైన ఉంచే ప్రజలు, చిన్న వాహనాలు వెళ్లేవిధంగా చర్యలు తీసుకున్నారు. రెండు గ్రామాల ప్రజలు రాకపోకలు ప్రారంభించారు. అనంతరం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో ఆర్‌అండ్‌బీ, ట్రాన్స్‌పోర్ట్, గృహనిర్మాణ తదితర శాఖల అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ సమీక్షించారు. మహాలక్ష్మి పథకం కింద ఎన్ని జీరో టికెట్లు జారీ అవుతున్నాయని, ఎంత ఆదాయం వస్తోందని ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్టుల ద్వారా వస్తున్న రెవెన్యూ తదితర వివరాలను ఆర్టీవోను అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా ఎన్ని గృహాలు నిర్మించారని ఆ శాఖ పీడీ భాస్కర్‌ను అడిగారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల జిల్లాలో ఇంకా తెగిపోయిన, రాకపోకలు నిలిచి పోయిన రహదారుల వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావు, నేషనల్ హైవే ఈఎన్‌సీ మధుసూదన్‌రెడ్డి, ఎస్ఈ నర్సింగం, నేషనల్ హైవే ఎస్ఈ ఏసీ ధర్మారెడ్డి, ఈఈ రెడ్డి మహేశ్, ఆర్డీవో నవీన్, ట్రాన్స్‌పోర్ట్ సీఈ పాల్గొన్నారు.


ఇబ్రహీంబాద్‌లో తెగిన రోడ్డును పరిశీలిస్తున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్

విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధం

మూసాపేట, సెప్టెంబరు 2: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైంది. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట మండలంలోని సూర్తితండాలో సోమవారం సాయంత్రం చోటు చేసుకున్నది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. తండాకు చెందిన మూడవత్ అమ్రానాయక్ అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి మన్నెంకొండ ఆలయానికి వెళ్లారు. ఇంట్లో అకస్మాత్తుగా షార్ట్‌సర్క్యూట్ ఏర్పడి మంటలు వ్యాపించాయి. గమనించిన పక్క ఇంటి వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న వంట సామగ్రి చాలా వరకు కాలిపోయింది. తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎస్సై పి.శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

పరమేశ్వరుడి పాదాల చెంతకు గంగమ్మ


నీటి మధ్యలో చెర్ల పరమేశ్వర స్వామి ఆలయం

ఆత్మకూరు,సెప్టెంబరు 2: ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని చెర్ల పరమేశ్వర స్వామి ఆలయంలో కొలువుదీరిన పరమేశ్వర స్వామి పాదాల చెంతకు గంగమ్మ చేరింది. నాలుగు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా అమరచింత పెద్ద చెరువు నుంచి ఖానా పూర్ మీదుగా ఆత్మకూరు చెర్ల పరమేశ్వర స్వామి చెరువుకు భారీ స్థాయిలో వరద చేరింది. గతంలో భూత్పూర్ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల అవుతానే చెరువు నిండేది. వర్షాలు కురవడంతో చెరువు నిండుకుండల మారనుందని పట్టణ ప్రజలు, మత్స్యకారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక పూజలు చేశారు.

కుక్కదాడిలో బాలికకు తీవ్ర గాయాలు

నారాయణపేట, సెప్టెంబరు 2: ఇంటి ఎదుట ఆడుకుంటున్న బాలికపై కుక్క దాడి చేసింది. తీవ్ర గాయాలైన బాలికను జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మునిసిపాలిటీ పరిధిలోని 24వ వార్డు లాల్ మసీద్ ప్రాంతంలో ఇంటి ఎదుట ఆరేళ్ల ఫరియానాజ్ ఆడుకుంటుండగా కుక్క దాడి చేసింది. దాంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో గుర్తించిన బంధువులు హుటాహుటిన జిల్లా ఆస్పత్రికి తరలించారు. బాలిక తలపై రెండు చోట్ల కుక్క దాడి చేయడంతో కుట్లు వేసేందుకు రాకపోవడంతో తోడ భాగంలో చర్మాన్ని తీసి తల భాగంలో కుట్లు వేయాలని హైదరాబాద్‌కు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. తమ దగ్గర స్థోమత లేదని జిల్లా ఆస్పత్రిలోనే వైద్యసేవలు అందించాలని వైద్యులను తల్లిదండ్రులు ప్రాధేయపడ్డారు. మునిసిపాలిటీలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని నియంత్రించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

గద్వాలలో పలు చోట్ల చోరీకి యత్నం

- దుకాణంలో రూ. 30వేల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు



చోరీకి గురైన దుకాణంలో వివరాలు తెలుసుకుంటున్న ఎస్ఐ శ్రీనివాస్

గద్వాల క్రైం, సెప్టెంబరు 2: జిల్లా కేంద్రంలో ఆదివారం తెల్లవారుజామున పలు దుకాణాలలో చోరీకి యత్నించగా, ఓ దుకాణంలో నగదు ఎత్తుకెళ్లారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీసాయికంప్యూటర్ దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి రూ. 30వేల నగదును ఎత్తుకెళ్లారు. అక్కడే కృష్ణమొబైల్ దుకాణంలో చోరీకి యత్నించారు. దీంతోపాటు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో ఉన్న మొబైల్ దుకాణంలో, ఆ పక్కనే ఉన్న ఓ కార్యాలయం, సమీపంలోని పాన్ దుకాణంలో కూడా చోరీకి యత్నించారు. సుంకులమ్మమెట్టు కాలనీలో ఉన్న ఇళ్ల తలుపులు గట్టిగా కొట్టడంతో కాలనీవాసులు బయటకు రావడం గమనించి దొంగలు పరారయ్యారు. దీనిపై సోమవారం పట్టణ ఎస్ఐ శ్రీనివాస్ పరిశీలించి వివరాలను బాధితుల నుంచి తెలుసుకున్నారు. చోరీకి పాల్పడిన వ్యక్తిని సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా గుర్తించినట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆసరా పింఛన్ల కోసం రాస్తారోకో

అమరచింత, సెప్టెంబరు 2: పెండింగ్‌లో ఉన్న ఆసరా పింఛన్లు ఇవ్వాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అమరచింత యూనియన్ బ్యాంక్ ముందు ప్రధాన రహదారిపై వృద్ధులతో కలిసి రాస్తారోకో చేశారు. గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్. అజయ్ మాట్లాడుతూ జూలై, ఆగస్టు నెలలకు సంబంధించిన ఆసరా పింఛన్లు పెండింగ్‌లో ఉన్నాయని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలో భాగంగా పింఛన్లను రెట్టింపు చేసి విడుదల చేయాలని కోరారు. ప్రతీ నెల పింఛన్లు పెండింగ్‌లో ఉండడం వల్ల వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, చేనేత, బీడీ కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచినా పింఛన్లను రెట్టింపు చేయడం లేదని వారు విమర్శించారు. రాస్తారోకోలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ఎస్ రమేష్, ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ఎస్పీ శ్యాంసుందర్, బుచ్చన్న, నవీన్, గంగమ్మ, బుడ్డమ్మ, ప్రభుదాస్, గోపాల్, సత్యన్న కురుమూర్తి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సింగోటం శ్రీవారి సముద్రానికి జలకళ


అలుగు పారుతున్న సింగోటం శ్రీవారి సముద్రం చెరువు

కొల్లాపూర్, సెప్టెంబరు 2: వరుసగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని సింగోటం శ్రీవారి సముద్రం అలుగు పారింది. దీంతో చెరువు కింద పంటలు సాగు చేసే రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని చౌటబెట్ల, తాళ్ల నరసింహాపురం మధ్య రహదారులన్నీ పూర్తిగా ధ్వంసం అయ్యాయి. వాగులు పారడంతో రహదారులు నీటిమయం అయ్యాయి. శిథిలావస్థకు చేరిన ఇళ్లలో ఉండే వారికి పట్టణంలోని మార్కెట్ యార్డులో అధికారులు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు.

కూల్చివేయడం ముమ్మాటికీ అన్యాయమే

- కూల్చివేతకు ముందు నోటీసులు ఎందుకు ఇవ్వలేదు
- అధికారులను ప్రశ్నించిన ఎంపీ డీకే.అరుణ



కూల్చివేతకు గురైన ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీ డీకే.అరుణ

మహబూబ్‌నగర్(క్లాక్‌టవర్), సెప్టెంబరు 2 : పాలమూరు పట్టణంలోని సర్వేనెంబర్ 523లో పేదలు కట్టుకున్న ఇళ్లను ఉన్న పళంగా కూల్చివేయడం ముమ్మాటికి అన్యాయమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే.అరుణ అన్నారు. పట్టణంలోని మునిసిపల్ పరిధి సర్వే నెంబర్ 523లో నిర్మించుకున్న పేద ప్రజల ఇళ్లను కూల్చివేసిన నేపథ్యంలో ఎంపీ సోమవారం ఆ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఈ సర్వే నెంబర్‌లో పేదలకు పట్టాలు ఇచ్చిన సంగతి అందరికీ తెలిసిన విషయమేనని, పట్టాలున్నవారు కాయకష్టం చేసి ఇళ్లు కట్టుకుంటే వారివి దొంగ పట్టా సర్టిఫికెట్లు, అక్రమ నిర్మాణాలు చేసుకున్నారనడం సరి కాదన్నారు. ప్రభుత్వ అధికారులు అలా అనుకున్నప్పుడు వారికి ముందుగా ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ఆమె తప్పుపట్టారు. ఈ విషయంపై అరుణ అర్బన్ తహసీల్దార్‌కు ఫోన్ చేసి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జరిగిన ఘటనపై కలెక్టర్ దృష్టి సారించి అర్హులెవరు, అనర్హులెవరు అన్నదానిపై విచారణ చేయించి, నిరాశ్రయులైన వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్‌తో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు. డీకే అరుణ వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి పాండురంగారెడ్డి, కౌన్సిలర్ అంజయ్య, ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి, పద్మవేణమ్మ, పట్టణ అధ్యక్షుడు నారాయణ యాదవ్, నాయకులు ఉన్నారు.

దమాగ్నాపూర్ సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన కలెక్టర్



చిన్నచింతకుంట మండలం దమాగ్నాపూర్ సబ్‌స్టేషన్ సమీపంలోని మన్నెవాగు కాలువ ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్

చిన్నచింతకుంట, సెప్టెంబరు 2 : భారీ వర్షాల కారణంగా వరద నీరు చేరి మునిగిన చిన్నచింతకుంట మండలం దమాగ్నాపూర్ సబ్‌స్టేషన్‌ను సోమవారం కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేసి, పరిశీలించారు. తక్షణమే సబ్‌స్టేషన్‌ను పునరుద్ధరించాలని ఆమె అధికారులను ఆదేశించారు. సబ్‌స్టేషన్ సమీపంలోని మన్నెవాగు కాలువ ద్వారా వరద నీరంతా సబ్‌స్టేషన్‌లోకి ప్రవేశించిందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. నీటిని వెంటనే పంపుల ద్వారా బయటకు పంపించాలని, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాటరీలు సైతం కొత్తవి ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు.

కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పరిశీలన

దేవరకద్ర : కోయిల్‌సాగర్ ప్రాజెక్టును సోమవారం కలెక్టర్ విజయేందిర బోయి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె ప్రాజెక్టు అధికారులతో నీటి రాకపోకలను తెలుసుకున్నారు. ప్రాజెక్టు గేట్లు తెరవడంతో చుట్టుపక్కల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం కౌకుంట్ల మండలంలోని ఇస్రంపల్లి వాగును పరిశీలించారు. వివరాలను తహసీల్దార్‌ను అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ శ్రీనువాసులు, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, ఆర్ఐ శరత్ కలెక్టర్ వెంట ఉన్నారు.

మండపాల వివరాలు నమోదు చేసుకోవాలి

- నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించండి
- సమన్వయ కమిటీ సమావేశంలో ఎస్పీ జానకి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 2 : జిల్లాలో వినాయక మండపాలు, విగ్రహాల వివరాలను పోలీస్‌శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఎస్పీ జానకి నిర్వాహకులను కోరారు. ఇది కేవలం మండపాల వద్ద భద్రత, బందోబస్తు కోసమేనని ఇందుకోసం ఎలాంటి ఫీ చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎన్ని విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నారో తెలిస్తే దాన్ని బట్టి బందోబస్తును ప్లాన్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో వినాయకచవితి ఉత్సవాలపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎస్పీ హాజరై ప్రసంగించారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసుకునే విధానం గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. విగ్రహాల ఎత్తు, ఎప్పుడు నిమజ్జనం చేస్తారు?, ఎక్కడ నిమజ్జనం చేస్తారు వంటి వివరాలు పోర్టల్‌లో నమోదు చేసుకుంటే బందోబస్తుకు సులువుగా ఉంటుందని తెలిపారు. మండపాల వద్ద క్రమశిక్షణ గల కార్యకర్తలను ఉంచాలని, మండపాల కింద వస్తువులేవీ ఉంచవద్దని సూచించారు. వర్షాలు కురుస్తున్నా యని, మండపాల్లో విద్యుత్ సమస్యలు రాకుండా చూసుకోవాలన్నారు. పోలీస్‌శాఖకు శాంతి భద్రతల విషయంలో పూర్తి సహకారం అందించాలన్నారు. ఇదివరకు పాలమూరులో జరి గిన అన్ని ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగాయన్న పేరుందని, అలాంటి సాంప్ర దాయాన్నే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. డీజేలను అనుమతించకూడదని సుప్రీంకోర్టు ఆదేశాలున్నాయని వాటిని పాటించాలని, మండపాల వద్ద లౌడ్ స్పీకర్లను ఉపయోగించ వద్దన్నారు. సమావేశంలో ఏఎస్పీ ఏ.రాములు, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీఎంహెచ్‌వో పద్మ, డీఎస్పీ వెంకటేశ్వర్లు, నాయకులు మద్దియాదిరెడ్డి, మనోహర్, మాల్యా ద్రి, అంజయ్య, రాజేందర్‌రెడ్డి ఉన్నారు.

ఉపాధ్యాయులకు జీపీఎఫ్ స్లిప్పులు అందించాలి

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 2 : ఉపాధ్యాయులకు జీపీఎఫ్ స్లిప్పులు అందించాలని కోరుతూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పీఆర్టీయూ తెలంగాణ నాయకులు జిల్లా పరిషత్ సీఈవో వెంకట్‌రెడ్డిని పరిషత్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో కలిసి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల యొక్క జీపీఎఫ్ ఖాతాల్లో వారి వేతనాల ద్వారా జమ అయిన నగదు, వడ్డీ వివరాలు 2021 నుంచి పెండింగ్‌లో ఉన్నాయని వాటిని వెంటనే అప్‌డేట్ చేయాలని, స్లిప్పులను ఆన్‌లైన్‌లో సరిచూసుకోవడానికి అవసరమైన సీజీజీపీఎఫ్ నంబర్లను ఉపాధ్యాయులకు అందించాలని తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎస్.యుగంధర్‌రెడ్డి, జిల్లా బాధ్యులతో కలిసి హర్షవర్ధన్‌రెడ్డి జడ్పీ సీఈవోను సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్యామ్‌బాబు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి రమాకాంత్ తదితరులున్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

పాలమూరు, సెప్టెంబరు 2 : రాష్ట్రంలో సమగ్ర కులగణన చేసి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్నారు. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం కేటాయించాలన్నారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్‌యాదవ్, జిల్లా అధ్యక్షుడు దోమ వెంకటేష్, సిర్ర వంశీ, బాలరాజు, భరత్‌గౌడ్, గొడుగు బాలచందర్, దోమ వెంకటయ్య, గంగయ్య, ప్రవీణ్, కేశవులు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి

- పాలమూరులో వైఎస్ఆర్, ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటుకు కృషి
- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
- ఘనంగా వైఎస్‌కు నివాళి



పాలమూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్/జడ్చర్ల/దేవరకద్ర/గండీడ్/భూత్పూర్/మిడ్జిల్/రాజాపూర్/చిన్నచింతకుంట, సెప్టెంబరు 2 : పాలమూరు అభివృద్ధి కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలు అమలు చేశారని, జిల్లాలో నాలుగు సాగునీటి ప్రాజెక్టులు చేపట్టారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వైఎస్ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం పాలమూరులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్ హయాంలో పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేశారన్నారు. ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ, 108 అంబులెన్స్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. ఆయన ఆశయ సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. యువతకు స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుచేసి విద్యార్థులకు నాణ్యమైన నైపుణ్యాలు అందించి ప్రపంచానికి నైపుణ్యాలు కలిగిన యువతను అందిస్తామన్నారు. జిల్లా కేంద్రంలో మహానేతలు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, ఎన్టీఆర్ విగ్రహాలను ఏర్పాటు చేస్తామని, మునిసిపాలిటీ నుంచి మంచి స్థలాన్ని చూసి వారి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, నాయకులు సిరాజ్‌ఖాద్రి, చంద్రకుమార్‌గౌడ్, లక్ష్మణ్‌యాదవ్, సీజే.బెనహర్, నవనీత, అజ్మత్‌అలీ, రాములు యాదవ్, ఫయాజ్, నాగరాజు తదితరులున్నారు.

జడ్చర్లలో క్రాస్‌రోడ్డు వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్ జోహార్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అశోక్‌యాదవ్, మాలిక్ షాకీర్, బాదిమి రవిశంకర్, బుక్క వెంకటేశ్, రాజేందర్‌గౌడ్, కార్యకర్తలు ఉన్నారు.

దేవరకద్ర నియోజకవర్గంలోని దేవరకద్ర, కౌకుంట్ల మండలాల్లో వైఎస్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డిలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నర్వశ్రీను, రాంపాండు, జవహర్, రాజు, నరసింహారెడ్డి, మల్లేష్ శ్రీను, వీరారెడ్డి, రామస్వామి, కిరణ్‌కుమార్, రాము, రాజు ఉన్నారు.

గండీడ్‌లో వైఎస్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు బోయిని గోపాల్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆశన్నగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

భూత్పూర్ చౌరస్తాలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అంతకుముందు వైఎస్ సేవలను మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

మిడ్జిల్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంచి పెట్టారు.

రాజాపూర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ముఖ్య కూడలిలో వైఎస్.రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నచింతకుంటలో వైఎస్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపిస్తే దేనికైనా సిద్ధం

- ఎవరి హయాంలో కబ్జాలు అయ్యాయో ఆల్ పార్టీ కమిటీతో విచారణ చేపడుదాం
- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సవాల్



జడ్చర్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి

జడ్చర్ల, సెప్టెంబరు 2 : పోలేపల్లి సెజ్‌లోని కంపెనీలతో డబ్బులు తీసుకున్నాడంటూ.. సెజ్‌లోని కంపెనీలతో సీఎస్ఆర్ ఫౌండేషన్ అకౌంట్‌కు డబ్బులు జమ చేసుకున్నాడంటూ.. బాలానగర్ నుంచి గంగాపురం గ్రామానికి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన జీవో కాకుండా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో మంజూరైన జీవోను చూపిస్తే దేనికైనా సిద్ధమంటూ జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సవాల్ చేశారు. చేసిన ఆరోపణలను వారం రోజుల్లోగా నిరూపించాలని లేకపోతే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాలకు దూరంగా ఉండడమే కాకుండా కాంగ్రెస్ పార్టీలో చేరమంటే చేరి, ఆయన వెంటనే ఉంటానని సవాల్ చేశారు. జడ్చర్లలోని ప్రేమ్‌రంగా గార్డెన్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాజకీయాలు హుందాగా నడిపించాలని, కేవలం ఎన్నికల సమయం వరకే రాజకీయాలు చేయాలని హితవు పలికారు. గడిచిన 20 సంవత్సరాల్లో ఎవరి హయాంలో కబ్జాలు జరిగాయో ఆల్ పార్టీ కమిటీ ఏర్పాటు చేసి విచారణ చేపడుదామని, బీఆర్ఎస్ పార్టీ వాళ్లు చేస్తే వెనక్కి తీసుకుని ప్రభుత్వానికి అప్పగిస్తామని, కబ్జాల గురించి ఇష్టానుసారంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల్ పార్టీ కమిటీ ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. నెలకు రూ.70 లక్షలు సెజ్ కంపెనీల నుంచి తీసుకున్నాడంటూ ఆరోపించి, అలాగే తనకు ఇవ్వడానికి వచ్చిన వారితో స్కూల్ బిల్డింగ్‌లు కట్టమని చెప్పినట్లు వెల్లడించిన ఎమ్మెల్యే, గడిచిన తొమ్మిది నెలలుగా ఆ డబ్బులు ఏ స్వచ్ఛంద కార్యక్రమాలు ఉపయోగించారో, ఎవరి జేబులోకి వెళ్లాయో వెల్లడించాలని కోరారు. ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో నల్లమట్టి అమ్ముకున్నాడని ఆరోపించాడని, రిజర్వాయర్ నిర్మాణంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిలకు చెందిన కంపెనీలున్నాయని, ఎవరెవరికి, ఎక్కడెక్కడ ఇచ్చారో తెలుసుకుని వెల్లడించాలన్నారు. ఆరోపణలను వారంలోగా నిరూపించాలని, లేకపోతే ఇక్కడే వచ్చి కూర్చుంటానని హెచ్చరించారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కోడ్గల్‌యాదయ్య, నాయకులు పిట్టలమురళీ, సుదర్శన్ గౌడ్, గోవర్ధన్‌రెడ్డి, రాంమోహన్ తదితరులున్నారు.

పోతులమడుగు వాగును పరిశీలించిన ఎమ్మెల్యే



పోతులమడుగు గ్రామ శివారులో ఉన్న వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నాయకులు

భూత్పూర్/చిన్నచింతకుంట, సెప్టెంబరు 2 : భూత్పూర్ మండలంలోని పోతులమడుగు-గోపన్నపల్లి గ్రామాల మధ్యలో ఉన్న వాగును దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. గోపన్నపల్లి గ్రామస్థులతో మాట్లాడారు. వానాకాలం వచ్చిందంటే పోతులమడుగు నుంచి గ్రామానికి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని చెప్పారు. కాజ్‌వే నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గోపన్నపల్లి గ్రామస్థులకు ట్యాంకర్ల ద్వారా మంచి నీరు, రేషన్, ఇతర సౌకర్యాలను కల్పించాలని అధికారులకు చెప్పారు. చిన్నచింతకుంట మండలంలోని దమాగ్నాపూర్-సీతారాంపేట గ్రామాలకు వెళ్లే దారిలో తెగిన కుంటతో పాటు, నెల్లికొండి వెళ్లే దారిలో వరద కారణంగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయిన ప్రాంతాన్ని మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. ఉంద్యాల చెరువు అలుగు పారి గ్రామ దళిత కాలనీలోకి నీరు చేరింది. మళ్లీ కాలనీలోకి నీళ్లు రాకుండా ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు చెప్పారు. పెద్దవడ్డెమాన్ సమీపంలోని వంతెనపై నీరు పారటంతో ఎమ్మెల్యే పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

వాగుల వద్ద అప్రమత్తం

కోయిలకొండ : మండలంలోని అంకిళ్ల పెద్దవాగు, గార్లపాడ్, మల్కాపూర్, ఆచార్యపూర్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల తహసీల్దార్ రాజాగణేష్, ఎంపీడీవో కాళప్ప సోమవారం పరిశీలించారు. అదేవిధంగా, దమాయపల్లి, గార్లపాడ్, మల్కాపూర్ వాగు వంతెన వద్ద బారికేడ్లను పరిశీలించారు. కోయిలకొండ కొండచెరువు తూంలో నీరు లీకేజీ కావడంపై మిషన్ కాకతీయ ఏఈ పరశురాం స్పందించి తూం వద్ద మరమ్మతులు చేయించారు.

కూలిన ఇళ్లు.. చెరువులకు గండ్లు

భూత్పూర్ : మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని ఆయా గ్రామాల్లో ఇళ్లు కూలిపోయాయి. కూలిన ఇళ్లను సోమవారం రెవెన్యూ అధికారులు పరిశీలించారు. మండలంలోని కొత్తూరులో రెండు ఇళ్లు, కప్పెట, అన్నాసాగర్, తాటిపర్తి, భట్టుపల్లి, పోతులమడుగు గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున ఇళ్లు కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా భూత్పూర్ మునిసిపాలిటీలోని వివిధ వార్డుల్లో మూడు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్లు మునిసిపల్ అధికారులు పేర్కొన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని శేరిపల్లి(బీ) గ్రామ శివారులో ఉన్న కోమటికుంట చెరువుకు గండి పడింది. దీంతో చెరువులో ఉన్న నీరు మొత్తం ఆయకట్టు పొలాల్లోకి రావడంతో పంట చేలు బాగా దెబ్బతిన్నాయి. మండలంలో ఎన్నడూ లేనివిధంగా భారీ వర్షం అతలాకుతలం చేసిందని ప్రజలు వాపోతున్నారు.

నంచర్లలో కూలిన ఇల్లు

మహమ్మదాబాద్ : మండల పరిధిలోని నంచర్ల గ్రామంలో చంద్రయ్య ఇల్లు ఆదివారం రాత్రి కూలిపోయింది. విషయం తెలుసుకున్న అధికారులు సోమవారం గ్రామంలో పర్యటించి, బాధితుడి నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, ఇల్లు కూలిపోకముందే ఇంట్లోని వారిని వేరే ఇంట్లోకి తరలించినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

కుంగిన మల్కచెరువు కట్ట

మహమ్మదాబాద్ మండల కేంద్రంలో కుంగిన మల్కచెరువు కట్టను సోమవారం ఇరిగేషన్ ఈఈ మనోహర్, ఎంపీడీవో దేవన్న, ఎస్సై శేఖర్‌రెడ్డి, స్పెషల్ ఆఫీసర్ తదితరులు పరిశీలించారు. కుంగిన చోట మట్టి పోయాలని సూచించినట్లు ఎంపీడీవో దేవన్న పంచాయతీ సిబ్బందికి సూచించారు.

తెగిన చెక్‌డ్యాం కట్ట..

మిడ్జిల్ : మండలంలోని కొత్తూరు గ్రామ శివారులోని దుందుభి వాగులో ఇటీవల మరమ్మతులు చేసిన చెక్‌డ్యాం కట్ట సోమవారం తెల్లవారుజామున పూర్తిగా తెగి నీళ్లు లేకుండా పోయాయని రైతులు వాపోయారు. గుత్తేదారులు పనులను నాణ్యతగా చేపట్టకపోవడం, అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే ఇలాంటివి పారిపాటిగా మారుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పంటల పరిశీలనలో వ్యవసాయాధికారి

మిడ్జిల్ మండల కేంద్రంతో పాటు, మున్ననూర్, మిడ్జిల్, వాడియాల గ్రామాల్లో వరద ఉధృతికి ఇసుక మేటలతో నష్టపోయిన రైతుల పంట పొలాలను సోమవారం జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్ పరిశీలించి, పంట నష్టంపై అంచనా వేశారు. పంటలకు వేసే ఎరువులు, చేపట్టే సస్యరక్షణ చర్యల గురించి ఆయన రైతులకు వివరించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు ఆంజనేయులు, ఏఈవోలు భగత్, అశ్రఫాతిమా, రైతులు ఉన్నారు.

చెరువు కట్టలను మరమ్మతు చేయిస్తాం

గండీడ్ : భారీ వర్షాల కారణంగా ఇరిగేషన్ ఏఈ మనోజ్, ప్రత్యేకాధికారి చత్రునాయక్‌లు మండల పరిధిలోని గండీడ్ ద్యావరి చెరువు, సాలర్‌నగర్ ప్రాజెక్టు చెరువు కట్టలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరద నీటికి అడ్డంకిగా మారిన చెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. ప్రమాదకరంగా ఉన్న చెరువు కట్టలను వెంటనే మరమ్మతు చేయిస్తామన్నారు. నీటి ప్రవాహం ఉన్నచోట జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవన్న, ఎస్సై శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, నాయకులు ఉన్నారు.

పొంగి పొర్లుతున్న ఊకచెట్టు వాగు

- పొలాల్లో కొట్టుకుపోయిన మోటార్లు
- తాగునీటి కోసం గ్రామస్థుల ఇబ్బంది



చిన్నచింతకుంటలో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని పట్టుకుంటున్న ప్రజలు

చిన్నచింతకుంట, సెప్టెంబరు 2 : వర్షాలు చిన్నచింతకుంట మండలాన్ని ఒక్కసారిగా కుదిపేశాయి. వర్షాలకు తోడు కోయిల్‌సాగర్ ప్రాజెక్టు 13 గేట్లను ఆదివారం ఎత్తివేయడంతో మండలంలోని ప్రధాన కల్పతరువుగా ఉన్న ఊకచెట్టు వాగులోకి భారీగా వరదనీరు చేరుకుంది. దాంతో దాదాపు 25 కిలోమీటర్ల మేరకు విస్తరించిన ఊకచెట్టువాగు నిండుగా పారుతున్నది. ఈ నేపథ్యంలో వాగు శివారు గ్రామాలైన బండర్‌పల్లి, లాల్‌కోట, పల్లమర్రి, నెల్లికొండి, ముచ్చింతల, అప్పంపల్లి, దాసర్‌పల్లి, తిర్మలాపూర్, గూడూరు, కురుమూర్తి, చిన్నచింతకుంట, మద్దూరు, అల్లీపూర్ తదితర గ్రామాలకు సంబంధించిన తాగునీటి మోటార్లు వాగులో కొట్టుకుపోయాయి. దీంతో ఆయా గ్రామాలకు తాగునీటి సమస్య ఏర్పడింది. పంచాయతీ అధికారులు సోమవారం ఆయా గ్రామాల ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటి సౌకర్యం కల్పించారు.

వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు

మరోవైపు వ్యవసాయ పొలాల్లో మోటార్లు సైతం నీటి ఉధృతిలో కొట్టుకుపోవడంతో ఏదులాపూర్, చిన్నచింతకుంట తదితర గ్రామాల్లో తాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో ప్రజలు వ్యవసాయ బోర్ల వద్దకు పరుగులు తీశారు. ఏదులాపూర్ శివారులో మహిళలు పొలాల నుంచి నీటిని తెచ్చుకున్నారు.

వర్షాల కారణంగా 80 బస్సులు రద్దు

మహబూబ్‌నగర్ టౌన్, సెప్టెంబరు 2 : రెండు, మూడు రోజులుగా భారీగా వర్షాలు కుర వడంతో ఆర్టీసీ బస్సుల షెడ్యూల్‌లో అంతరాయం ఏర్పడింది. రోజువారీగా 830 బస్సులు నడపాల్సి ఉండగా ఆది, సోమవారం వరదల్లో రోడ్లు కొట్టుకుపోవడం, ప్రయాణికులు లేకపో వడంతో పాటు ఇతర కారణాల వల్ల 80 బస్సులను రద్దు చేసినట్లు రీజియన్ మేనేజర్ విశ్రీదేవి తెలిపారు. ముఖ్యంగా తాండూర్ బస్సులు హన్వాడ మండలం ఇబ్రహీంబాద్ వద్ద రోడ్డు తెగిపోవడంతో బస్సులను పూర్తిగా రద్దు చేశామన్నారు. మహబూబ్‌నగర్ డిపోలో దా దాపు 25 బస్సులను రద్దు చేసినట్లు తెలిపారు. వర్షం సద్దుమణిగిన తర్వాత బస్సులను పునరుద్ధరిస్తామన్నారు. కాగా, అధిక వర్షాలకు తోడు ప్రభుత్వం సోమవారం సెలవు ప్రకటిం చడంతో పాటు వర్షాలకు ప్రయాణికులు కూడా ఆసక్తి చూపకపోవడంతో స్థానిక బస్టాండ్ ప్రయాణికులు లేక వెలవెలబోయింది.

పీహెచ్‌సీని పరిశీలించిన అధికారులు

మిడ్జిల్, సెప్టెంబరు 2 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం మండల ప్రత్యేకాధికారి వెంకటేష్, తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీవో గీతాంజలిలు పరిశీలించారు. పీహెచ్‌సీలో రోగులకు అందజేస్తున్న మందులు, వైద్య సేవల గురించి డాక్టర్ శివకాంత్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆదివారం కురిసిన వర్షం వరద నీటి ఉధృతికి ఆరోగ్య కేంద్రానికి వెళ్లే వీలులేకుండా పోయింది. పీహెచ్‌సీ పరిసరాలతో పాటు రూంలను పరిశీలించారు. వారి వెంట వైద్య సిబ్బంది, మండల అధికారులు ఉన్నారు.

గోవిందా.. గోవింద

చిన్నచింతకుంట, సెప్టెంబరు 2 : మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలోని కురుమూర్తి వేంకటేశ్వరస్వామి ఆలయం సోమవారం అమావాస్య సందర్భంగా భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి ఆలయం, జాతర మైదానం గోవిందనామస్మరణలో మారుమోగింది. భక్తులు దాసంగాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

దేవాలయాల్లో శ్రావణ అమావాస్య వేడుకలు

భూత్పూర్, సెప్టెంబరు 2 : మండలంలోని పలు గ్రామాల్లో శ్రావణ అమావాస్య వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. శ్రావణ సోమవారం చివరిరోజు కావడంతో మండలంలోని వివిధ గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. అదేవిధంగా మునిసిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో ఉన్న శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివుడికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. సంజీవరాయుని దేవాలయంలో మహిళలు పూజలు చేశారు.

వీరభద్రుడికి ప్రత్యేక పూజలు

కోయిలకొండ, సెప్టెంబరు 2 : మండలంలోని అచార్యపూర్ వీరభద్రస్వామి దేవాలయంలో శ్రావణమాసం అమావాస్య ఆఖరి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. 108 కలశాలకు పూజలు నిర్వహించి, ఘటకాభిషేకం, సహస్ర బిల్వార్చన, రుద్రహోమం జరిపించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా, శ్రీరామకొండలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు టి.రాజ్‌కుమార్, టి.రాము, టి.విజయ్ ఉన్నారు.

గోశాలలో గోమాతలకు...

జడ్చర్ల, సెప్టెంబరు 2 : జడ్చర్ల పట్టణంలోని శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలోని గోశాలలో సోమవారం అమావాస్య సందర్భంగా గోమాతలకు పూజలు చేశారు. శ్రీనివాసరావు, లవకుమార్, మంచనపాండయ్య, తిరుపతిరెడ్డి, గణేష్, రాంమోహన్, నర్సిములు, రాజు, సురేశ్, రవీంద్రచారి, రాధాకృష్ణ, మహిళలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతుల్లో న్యాయం చేయాలి

పాలమూరు, సెప్టెంబరు 2 : విద్యుత్ సంస్థలో పనిచేసే ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు పదోన్నతుల్లో న్యాయం చేయాలని రాష్ట్ర విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం(621) నాయకుడు బీచుపల్లి డిమాండ్ చేశారు. సోమవారం విద్యుత్ భవన్, సర్కిల్ కార్యాలయాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. వివాదాస్పదమైన టీవోవో 954, ఎస్‌వోవో 37, ఎస్‌పీవోవో 101, టీవోవోవో 62 ఆర్డర్లను రద్దు చేయాలన్నారు. క్యాన్సిక్వెన్షియల్ సీనియారిటీని కొనసాగించాలన్నారు. ఆర్టిజన్ల డిమాండ్స్ కన్వర్షన్ అండ్ ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింప చేయాలన్నారు.

ఘనంగా ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ జన్మదినం

జడ్చర్ల, సెప్టెంబరు 2 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్‌కల్యాణ్ జన్మదినాన్ని సోమవారం జడ్చర్లలో జనసేన పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని నేతాజీ చౌరస్తాలో పార్టీ నాయకులు కేకు కట్ చేశారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జి అమరవాది ప్రభు, స్వామి, రామకృష్ణ, అశోక్, రాజు, మధు, నవీన్, కృష్ణ, వెంకటేశ్ ఉన్నారు.

స్వేరోస్ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మణ్



మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 2 : స్వేరోస్ జిల్లా అధ్యక్షుడిగా ఇబ్రహీంబాద్ లక్ష్మణ్ ఎంపికయ్యారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన స్వేరోస్ సమావేశానికి చీఫ్ కన్వీనర్ దుర్గన్న, రాష్ట్ర అధ్యక్షుడు వీరయ్య హాజరై మాట్లాడారు స్వేరో సిద్ధాంతాన్ని ప్రతీ గ్రామానికి తీసుకెళ్లాలన్నారు. అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం అనే ప్రాథమిక అంశాలపై స్వేరో సిద్ధాంతం కృషి చేస్తుందన్నారు. అనంతరం లక్ష్మణ్‌ను జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేస్తూ నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో స్వేరో సభ్యులు పాల్గొన్నారు.

వ్యాపార సంఘం సభ్యుడికి ఆర్థిక సహాయం

మిడ్జిల్, సెప్టెంబరు 2 : మండలంలోని వాడియాల గ్రామానికి చెందిన రాఘవేందర్ ఇటీవల ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన విషయం తెలుసుకున్న మిడ్జిల్ వ్యాపార సంఘం అధ్యక్షులు గంజి కృష్ణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులుతో కలిసి వ్యాపార సంఘం నాయకులు రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం బాధితుడికి అందజేశారు. సంఘం నాయకులు రాజేశ్వర్, అశోక్, చెన్నకేశవ్, జహీర్, బాల్‌నారాయణ, జహంగీర్, యాదయ్య, మాసుంబాబా, శ్రీనివాసులు, రాఘవేందర్, భీంరాజు, నర్సింహ్మా ఉన్నారు.

వరద ప్రాంతాలకు పరిష్కారం అన్వేషించాలి

పాలమూరు, సెప్టెంబరు 2 : పాలమూరు పట్టణంలోని వరద ప్రాంతాలను సోమవారం సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఎర్రకుంట పరివాహక ప్రాంతం, కుర్నిణిశెట్టికాలనీ, పాతపాలమూరు, దళితవాడ, హబీబ్‌నగర్, లక్ష్మీనగర్‌కాలనీ, చిక్కుడువాగు, మోతినగర్ తదితర ప్రాంతాలను బృందం సభ్యులు పరిశీలించారు. ఎర్రకుంట, పెద్దచెరువు, ఇమామ్‌సాబ్‌కుంట, గాండ్లనుచెరువు, పాలకొండ చెరువు, దొడ్డలోనిపల్లి చెరువు, కొత్తచెరువు, పట్టణ పరివాహక ప్రాంతంలోని చెరువులు, కుంటలు పొంగి పొర్లుతున్నాయని, పాతపాలమూరు దళితవాడలో ఇళ్లల్లోకి నీరు చేరిందని పేర్కొన్నారు. ప్రతీ ఏడాది వర్షాకాలం వచ్చిందంటే కాలనీలు, ఇళ్లల్లోకి నీరు ఎందుకు చేరుతుందో ఇంజనీర్లతో పరిశీలించి, శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. ప్రజాప్రతినిధులు, నిపుణులు, ప్రజా సంఘాలు, అధికారులతో సమన్వయ మీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. పరిశీలనలో నల్లవెల్లి కురుమూర్తి, కిల్లెగోపాల్, చంద్రకాంత్, విష్ణువర్ధన్‌లు ఉన్నారు.